

శ్రీపురం కాలనీలో మార్వాడీల హోలీ సంబరాలు



హోలీ వేడుకల్లో

రంగ్ బర్‌సే..

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు



కలెక్టర్ దంపతులు



ఎంపీ బండి సంజయ్ దంపతులు



మేయర్ సునీల్‌రావు దంపతులు



కరీంనగర్ కల్చరల్, మార్చి 25: జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రం లోని పలు డివిజన్‌లు, మండలాలు, గ్రామాల్లోని వీధు లన్నీ రంగులమయమయ్యాయి. ఉదయం నుంచే ఉత్సాహంతో అన్ని వర్గాల ప్రజలు రంగులు తీసుకుని వీధుల్లోకి వచ్చారు. కుర్ర కారు హుషారుగా బైకులపై షికారు చేస్తూ రంగులు చల్లుకున్నారు.

● కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఆమె భర్త దీపాంక్‌సత్పతి, కుటుంబ సభ్యులు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. కలెక్టర్ దంపతులు నృత్యాలు చేస్తూ రంగులు పూస్తూ స్వీట్లు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పాటలకు అనుగుణంగా కలెక్టర్‌తో పాటు అందరూ స్టెప్పులేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, వివిధశాఖల జిల్లా అధికారులు, టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.



ఎల్ఎండీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

● బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ నివాసంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. సంబరాల్లో ఎంపీ సతీమణి అపర్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ సునీల్‌రావు, సతీమణి అపర్ణ వేడుకల్లో పాల్గొని రంగులు పులుముతూ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు స్థానికులు, నాయకులు ఆయనకు రంగులు పులిమి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ స్టేడియంలో శివ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు గుండ శ్రీనివాస్, భిషప్ సింగ్, ఎడ్ల మధు, యాదవ్ శ్రీను, చంద్రం, రాజేందర్ వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. తెలం గాణ రచయితల వేదిక, సాహితీ సోపతి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో జరిగిన వేడుకల్లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, పెనుగొండ బసవేశ్వర్, యుగేందర్, మేరుగు ప్రవీణ్, వాసాల రవీందర్, అరుణ్, విలాసాగరం రవీందర్, మమత వేణు, సదాశ్రీ, బూర్ల వేంకటేశ్వర్లు, కందుకూరి అంజయ్య పాల్గొన్నారు. ముకరంపుర పద్మనాయక హాస్టల్‌లో విద్యార్థినులు హోలీ వేడుకల్లో మునిగి తేలారు. జ్యోతినగర్‌లో అమ్మ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు, బీజేపీ నాయకురాలు సుజాతారెడ్డి ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరిగాయి. తెలంగాణ చౌక్‌లో ఫొటో, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన హోలీ వేడుకల్లో ఎండీ షుకూర్, దాడి సంపత్‌కుమార్, శైలేందర్‌రెడ్డి, కవికుమార్, సుధీర్, సలీమ్, దండు సంపత్, జన్నారం శ్రీనివాస్, ఉదయ్, సుమంత్, రవి, సుధీర్, సదానందం, గీకురు అనిల్, అంజి, రఘు పాల్గొన్నారు. శ్రీపురంలో రాజస్థానీ సేవా సమాజ్, మార్వాడి యువమంచ్, రాజస్థానీ మహిళా మండల్ ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలతో నృత్యాలు చేస్తూ హోలీ దూండ్ జరుపుకున్నారు. సిక్‌వాడీలోని గురుద్వారా ఎదుట ఖల్సా యూత్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



కరీంనగర్ భగత్‌నగర్‌లో హోలీ వేడుకలు



రంగులు పూసుకుంటున్న శివ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు



జ్యోతినగర్ గణేశ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో..



హ్యాపీ హోలీ అంటున్న విద్యార్థినులు

కొనసాగుతున్న ఎత్తిపోతలు

● ఎల్లంపల్లి రెండో పంపు ప్రారంభం



రెండు డెలివరీ సిస్టర్న్‌ల నుంచి వస్తున్న ఎల్లంపల్లి నీరు

గంగాధర, మార్చి 25: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రెండో పంపును అధికారులు ప్రారంభించారు. నారాయణపూర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో ఇస్లాంపూర్ నుంచి కొడిమ్యాల మండలం పోతారానికి నీటిని ఎత్తిపోయడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రిజర్వాయర్ నిండగానే కొడిమ్యాలకు నీటిని పంపింగ్ చేస్తూనే ఎడమ కాలువ, డి1గేట్లను ఎత్తి నీరు విడుదలచేస్తామని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ గేటు, డి1 గేటు వద్ద లష్కర్లతో నీటిపారుదల శాఖ అధికారులు కాపలా పెట్టారు.

తెరపైకి జీవన్‌రెడ్డి

- కరీంనగర్‌పై పునరాలోచన
- ఎంపీ టికెట్ ఇవ్వకుంటే మంత్రి పదవి
- ఒకటి రెండు రోజుల్లో తేలే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)


కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ లోక్‌సభ స్థానానికి అభ్యర్థి ఎంపిక విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డిని పోటీ చేయిస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ప్రారంభమైన తొలిరోజుల్లోనే జీవన్‌రెడ్డి పేరును పరిశీలించినా ఆయన సొంత నియోజకవర్గమైన జగిత్యాల పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గాలు అంతర్భాగమై ఉన్న నిజామాబాద్ లోక్‌స్థానంలో పోటీకి దింపితే బాగుంటుందనే ఆలోచనకు వచ్చింది. తొలుత కరీంనగర్‌పైనే ఆసక్తి చూపించిన జీవన్‌రెడ్డి కూడా కరీంనగర్ జిల్లాలో పార్టీ అస్తవ్యస్త పరిస్థితులను చూసిన తర్వాత నిజామాబాద్ వైపే మొగ్గు చూపి ఆ స్థానం కోసమే ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం ఇప్పటి వరకు ప్రకటించిన తొమ్మిది స్థానాలు పోనూ మిగిలి ఉన్న స్థానాల్లో కులాల సమీకరణాలు పాటించడానికి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా గెలుపు సాధించడమే లక్ష్యంగా ఎవరైతే బాగుంటుందన్న అంశాలను పరిగణలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. కరీంనగర్ స్థానంలో టికెట్ తనదేనన్న ధీమాతో వెలిచాల రాజేందర్ రావు ఉండగా అంతే నమ్మకంతో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కూడా తన ప్రయత్నాలు తాను చేస్తున్నారు. ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి ఎక్కువ స్థానాలు కేటాయించిన నేపథ్యంలో టికెట్ తననే వరిస్తుందన్న ధీమాతో బీసీ సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్ ఉన్నారు.

● ఆరో జాబితాలోనైనా తేలుతుందా?

హోలీ తర్వాత జరిగే కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ, సిడబ్ల్యూసి సమావేశాల అనంతరం ఆరో జాబితాలో కరీంనగర్ అభ్యర్థి వ్యవహారం తేలిపోతుందని అందరూ ఆశిస్తున్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో రెండు బీసీలకు, రెండు ఎస్సీలకు, ఒక ఎస్టీ, నాలుగు స్థానాలకు రెడ్లకు అవకాశం కల్పించారు. ఇంకా ఒక ఎస్టీ, ఒక ఎస్సీ స్థానాలతోపాటు మరో ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. ఈ ఆరు స్థానాల్లో కరీంనగర్, నిజామాబాద్, భువనగిరి, ఖమ్మం స్థానాలలో రెడ్డి అభ్యర్థులే ప్రధాన పోటీదారులుగా ఉన్నారు.



ఈ స్థానాల్లో రెండింటిని మాత్రమే రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించే అవకాశముంది. ఇప్పటి వరకు వస్తున్న ఆనవాయితీ ప్రకారం పార్లమెంట్ ఎన్నికల్లో ఎప్పుడు కూడా రెడ్డి సామాజిక వర్గానికి ఆరు సీట్లకు మించి అవకాశం కల్పించలేదు. కరీంనగర్‌లో రెడ్డి అభ్యర్థికి ఇవ్వాలనుకుంటే ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పేర్లను పరిశీలనలోకి తీసుకునే అవకాశం ఉంది. వీరిలో ఎవరికి గెలుపు అవకాశాలు ఉంటాయన్న విషయంలో అభిప్రాయ సేకరణ చేసిన పార్టీ నాయకత్వం జీవన్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్లు చెబుతున్నారు. జీవన్‌రెడ్డిని కరీంనగర్‌లో పోటీచేయించి నిజామాబాద్ నుంచి బీసీకి అవకాశం కల్పించే ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కరీం నగర్‌లో రెడ్డి అభ్యర్థి కాని పక్షంలో ఇప్పటి వరకు వెలమ సామాజిక వర్గానికి ఎక్కడా సీటు కేటా యించక పోవడంతో వెలిచాల రాజేందర్‌రావు పేరు ఖరారు కావచ్చని భావిస్తు న్నారు. ఖమ్మం నుంచి, మెదక్ నుంచి ఆ సామాజిక వర్గ నేతలు టికెట్ ఆశిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభమైన ప్పటి నుంచి రెండు సార్లు మినహా వెలమ అభ్యర్థులే ఇక్కడ విజయం సాధిస్తూ వచ్చిన నేపథ్యం రాజేందర్ రావును అభ్యర్థిగా ఎంపిక చేయడానికి బలం చేకూర్చుతున్నది. జీవన్‌రెడ్డికి కరీంనగర్‌లో గానీ నిజామా బాద్‌లోగానీ ఎంపీ టికెట్ ఇవ్వని పక్షంలో ఆయనకు మంత్రి పదవి కల్పించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఎంపీ టికెట్ రాని పక్షంలో మంత్రి పదవిని ఆశిస్తున్నవారిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, గడ్డం వివేక్ ఉన్నారు. వివేక్ తనయుడు వంశీకృష్ణకు పెద్దపల్లిలో పోటీచేసే అవకాశాన్ని కల్పించారు. సీనియర్ నాయకుడు, గతంలో మంత్రిగా పనిచేసి విశేష అనుభవం ఉన్న జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే జగిత్యాల జిల్లాకు అవకాశం కల్పించినట్లు అవుతుందని ఆలోచిస్తున్నారని తెలిసింది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	6:27 మంగళవారం
సహర్	4:46 బుధవారం

ఘనంగా లక్ష్మీనృసింహుడి శకటోత్సవం



నల్లగొండ ఆలయం వద్ద మేకపోతుల బండితో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తిమ్మాపూర్, మార్చి 25: మండలంలోని నల్లగొండ గ్రామంలోని సీతారామ లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శకటోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయం చుట్టూ ద్విచక్రవాహనాలు, ఎడ్ల బండ్లు, కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ప్రదక్షనలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో భక్తులు తీసుకువచ్చిన మేకపోతుల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు.

ఇటిక్యాలలో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులుగావించి ఆలయం చుట్టూ రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు గంగారెడ్డి, నారాయణ గౌడ్, సామల్ల లావణ్యవేణు, నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రఘునాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారెస్పీ కాలువలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలో పడి మానసిక, శారీరక వైకల్యం గల జిల్లాల నవీన్ (28) అనే యువకుడు మృతి చెందాడు. నవీన్ గ్రామ శివారులోని చర్చికి ఆదివారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందినట్లు రాత్రి 8:30 గంటలకు గుర్తించారు. కాలువ వద్దకు మల విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని అన్న సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

రాయికల్, మార్చి 25: రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయికల్‌కు చెందిన సూర్య, కిరణ్, అభి, సన్నీతో పాటు మరి కొందరు మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు, ఆస్పత్రి సిబ్బందిపై దుర్భాషలాడుతూ బెదిరించారు. డ్యూటీ డాక్టర్ ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

ధర్మపురిలో ఉగ్రనారసింహుడి డోలోత్సవం

● వైభవంగా బ్రహ్మోత్సవాలు ● మొక్కులు తీర్చుకున్న భక్తులు



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి డోలోత్సవం



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి తెప్పోత్సవం



ధర్మపురిలో స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూలైను

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర) తెప్పోత్సవం, డోలోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, నవీన్ మధ్యాహ్నం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన స్వామివారలను కూర్చోబెట్టి, బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామ స్మరణ చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరు మహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామి వారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సనాతన సాంప్రదాయ రీతిలో అర్చకులు స్వామి వారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామి వారలపై బుకాగులాలు చల్లి కట్న కానుకలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. గతంలో కన్న భక్తుల సంఖ్య అధికంగా తగ్గి పోయింది. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో శోభిల్లింది. రాత్రివరకు ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్ సహా పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రావర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లసెట్టి సుజాత, కౌమురెల్లి పవన్ కుమార్, సేదునూర్ శ్రీధర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్య వైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ ఆర్య వైశ్య వర్తక సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ, పుట్ట బంగారం నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామివారల కల్యాణ, తెప్ప, డోలోత్సవాలను నిత్యం వేలాది మంది భక్తులు తిలకించారు. అన్నదానం సమయంలో శెరిపల్లి కావేరి అనే భక్తురాలు బ్యాగ్, ఫోన్, పోగొట్టుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌కు దొరకగా భక్తురాలు ఆచూకీ కనుగొని ఆమెకు అప్పగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాల వద్ద లోక క్షేమార్థం సుదర్శన హోమం నిర్వహించారు. ఐదవ రోజు ఆలయానికి రూ 11,26,000 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.4,84,463 లభించగా లడ్డు, ప్రసాదాల ద్వారా రూ. 4,94,885 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 1,46,652 విరాళాలు సమర్పించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మపుష్కరిణి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్ప, డోలోత్సవం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయి.

కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్

మల్యాల, మార్చి 25: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈవో వెంకటేష్‌పై దేవాదాయ శాఖ కమిషనర్ గత శనివారం సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టగా ఉద్యోగులు, అర్చకులు అభినందించారు

యవతిని ట్రాప్ చేసిన ఏఎస్సై వీఆర్‌కు అటాచ్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం, మార్చి 25: ఇబ్రహీంపట్నం ఏఎస్సై రాములుపై ఉన్నతధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఠాణాకు వచ్చిన యువతిని ట్రాప్ చేసిన ఏఎస్సై' కథనం ప్రచురితం కాగా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ స్పందించారు. ఏఎస్సై వ్యవహారం సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టారు. ఏఎస్సై వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశం కావడంతో ఏఎస్సై రాములును జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సమగ్ర విచారణ అనంతరం ఏఎస్ఐపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఠాణాకు వచ్చిన మహిళలకు భద్రత కల్పించాల్సిన పోలీస్‌లే ఈ విధంగా ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతధికారులు దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్/కోనరావుపేట, మార్చి 25: భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జరిగింది. సిరిసిల్ల పట్టాణానికి చెందిన గూడూరు సాగర్ (26) కారు డ్రైవర్‌గా పనిచేసున్నాడు. మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన గూడూరు అనూష, సాగర్ ఇరు కుటుంబాలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. పిల్లలు పుట్టకపోవడంతో పాటు సరైన కూలి పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాడు. సాగర్ తల్లిదండ్రులు చంద్రకళ, బాబు దంపతులు ఉపాధి కోసం కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఓ ఇంటిలో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు పిల్లలు పుట్టడం లేదని 20 రోజుల క్రితం సాగర్‌తో భార్య అనూష గొడవ పడి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తల్లిదండ్రులు ఉంటున్న కొలనూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడే నిద్రించి తెల్లవారుజామున వారు ఉంటున్న ఇంటిపై ఉన్న సలాకకు చీరతో ఉరేసుకున్నాడు. సాగర్ తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మరోవైపు పండుగ పూట మిత్రుడు సాగర్ చనిపోవడంతో స్నేహితులతో పాటు ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న త్రిరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిసాయి. శివకల్యాణ మహోత్సవాలకు ముందుగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఉదయం, సాయంత్రం రాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపం ఊయలలో ఉంచి డోలోత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివకల్యాణోత్సవాలు

ఈ నెల 27వ తేదీ బుధవారం నుంచి శివకల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 28వ తేదీ గురువారం పార్వతీ రాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హోలీ వేడుకల్లో విషాదం

కరీంనగర్ క్రైం, మార్చి 25: అప్పటి వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద కేళిలో మునిగి తేలిన ఆ యువకులు ఇద్దరు నిమిషాల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. హోలీ సంబరాలు చేసుకున్న స్నేహితులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలుసుకుని తోటి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హోలీ పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. పోలీసులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం...

కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్ రోడ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పాను గంటి కృష్ణ వంశీ(24) అక్కడికక్కడే మృతి చెందగా గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న పొశ్ల శివకుమార్(24) ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కృష్ణవంశీ, పొశ్ల శివకుమార్‌లు సోమవారం ఉదయం నుంచి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్నేహితులతో కలిసి భోజనాలు ముగించారు. కృష్ణవంశీ, శివకుమార్ సాయంత్రం 6 గంటలకు జ్యోతినగర్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఐటీ టవర్ వద్ద బైక్ రోడ్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరు డివైడర్‌పై ఉన్న సైన్‌బోర్డు స్తంభానికి తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణవంశీ అక్కడికక్కడే మరణించగా శివకుమార్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. మానకొండూర్ మండలం గద్దెపాకకు చెందిన కృష్ణవంశీ ప్రస్తుతం శ్రీనగర్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కృష్ణవంశీ పారామిలటరీ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ వారం రోజుల కిందటే కరీంనగర్‌కు వచ్చాడు. ఆయన తండ్రి పెయింటర్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటుండగా తల్లి వంట పనులు చేస్తూ జీవిస్తున్నది. ఒక సోదరుడు ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం



కృష్ణవంశీ(ఫైల్)



శివకుమార్ (ఫైల్)

రొంపికుంటకు చెందిన శివకుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్నాడు. హోలీ కావటంతో కృష్ణవంశీ, శివకుమార్‌లు స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బైక్‌పై వెళుతూ మృత్యువాత పడ్డారు. కృష్ణ వంశీ, శివకుమార్‌ల మరణవార్త తెలుసుకున్న వారి స్నేహితులు, బంధు వులు ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.



గుంపులుగా పంట చేనులోకి వెళ్తున్న కోతులు

వానర 'దండయాత్ర'

మల్యాల, మార్చి 25: సమూహాలుగా గ్రామాలు, పంట చేలపై దండయాత్ర చేస్తున్న కోతులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద అధికం కాగ పంట చేలను విడిచి పెట్టడం లేదు. గుంపులుగా పంటలపై దాడి చేస్తూ నష్టం చేస్తున్నాయి. దీంతో కోతులను నివారించలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మల్యాల శివారులో గుంపులుగా వచ్చిన కోతులు పంటలపై దాడి చేశాయి. వాటిని తరమడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

● రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మంథని, మార్చి 25: స్థానిక సీఆర్‌కే అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెం. 306లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు ఈ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నారు. ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అతని భార్య శ్రీలత కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంథని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం, ఫైర్‌మెన్ శ్రీనివాస్, డ్రైవర్ కం ఆపరేటర్ రమేష్, కోంద్ర నాగరాజు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 50 వేల నగదు, రూ. 1.50 లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది.

షార్ట్ సూర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఈరీ కైలాసం ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుడు కైలాసం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో సామగ్రితో సాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే బీరువాలో ఉన్న బంగారు అభరణాలు మంటల్లో కరిగిపోయినట్లు బాధితులు తెలిపారు. బీరువాలో ఉన్నా రూ. 30 వేలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ పడిగెల మానసరాజు పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ బాధితులను పరామర్శించారు.



కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న నాయకులు

రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 25: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్ తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్సూరెన్స్, నెక్సా మోటార్స్, బీవీఆర్ సొల్యూషన్స్, శాశ్వత డెవలపర్స్, ఆనంద నిలయం డెవలపర్స్ వారు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రాడ్యుయేట్, పీజీ 2021,22,23 ప్రస్తుత చివరి సెమిస్టర్ చదువుతున్న కళాశాల, ఇతర కళాశాలల అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అర్హులైన వారు వారి రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, కాశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ వద్ద జరుగుతుందని తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని బహిర్భూమికి వెళ్లిన యువకుడు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నర్ర నగేష్ (21) అనే యువకుడు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. వీరాపూర్ రోడ్డులోని వ్యవసాయ బావి వద్దకు బహిర్భూమికి వెళ్లి బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. స్నేహితులకు ఈత రాకపోవడంతో వెంటనే యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి బావిలో గాలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని రెండు గంటల పాటు గాలించగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి



రాజకుమారి (ఫైల్)

మల్యాల, మార్చి 25: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మల్యాల మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజకుమారి(43) అనే మహిళ ఈ నెల 22న కుటుంబసభ్యులతో కలిసి కారులో వెలుతుండగా బెజ్జంకి సమీపంలో లారీ ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు దాదాపు రూ.6లక్షలకు పైగా అవసరం కాగ నిరుపేద కుటుంబం కావడంతో ఆమె కొడుకుతో పాటు పలువురు యువకులు సోషల్‌మీడియా ద్వారా సాయం కోరారు. దాతలు సాయం అందిస్తున్న తరుణంలోనే పరిస్థితి విషమించి రాజకుమారి మృతి చెందింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

మల్యాల, మార్చి 25: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో గల వీఆర్‌కే కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గరికి గాయాలు అయ్యాయి. కొడిమ్యాలకు చెందిన దండుగుల శేఖర్ తన భార్య ఇద్దరు చిన్నారులతో కలిసి ద్విచక్రవాహనంపై వెలుతుండగా వీఆర్‌కే కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అదుపు తప్పి వస్తున్న కారును తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఢీకొనడంతో శేఖర్‌తో పాటు అతని కూతురు సాయివర్శిత, కుమారుడు రుద్రాంశ్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సాయివర్శిత కొద్ది దూరంలో ఎగిరిపడడంతో తలకు గాయాలు కాగా గాయపడిన వారిని చికిత్స కోసం 108లో జగిత్యాలకు తరలించారు.

యువకుడి ఆకస్మిక మృతి

గంగాధర, మార్చి 25: గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన వేముల మురళి(42) సోమవారం ఇంట్లోనే ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే మురళి మృతికి షాపు యాజమాని కారణమంటూ అతడి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేశారు. దీనిపై ఎస్ఐ కిరణ్‌రెడ్డిని వివరాలు కోరగా.. మధురానగర్‌కు చెందిన వేముల మురళి సోమవారం వేకువ జామున నిద్రలోనే మృతి చెందాడు. తెల్లవారినా లేవకపోవడంతో అతని భార్య గౌతమి లేపినా ఎలాంటి స్పందన లేదు. విషయాన్ని మురళి అన్న రమేష్, తల్లికి తెలపగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు.మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మురళికి చెందిన భూమి విషయంలో పంచాయతీ జరుగుతోంది. భూమి విషయం ఎప్పటికీ తెగకపోవడంతో మానసికంగా ఆందోళన చెంది మృతి చెంది ఉంటాడని బంధువులు, గ్రామస్థులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్, మార్చి 25: జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో హోలీ పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన రమ అనే మహిళ, అదే గ్రామానికి చెందిన బోగు రాకేష్‌ల మధ్య పాత గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం గ్రామంలో యువకులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈక్రమంలో బోగు రాకేష్ అనే యువకుడు మేడిశెట్టి రమ ఇంటిలోపలకి కోడి గుడ్డు విసిరారు. ఇదే విషయమై తన ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరివేశావు అని రాకేష్ ను రమ కుమారుడు రిషి నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగి గొడవకు దారి తీసింది. రిషి, రాకేష్ లు ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గొడవను ఆపేందుకు వెళ్లిన రమపై రాకేష్ మెడపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. రమ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాయిలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం

● మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి25: ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక ధారుడ్యం అవసరమని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సోమవారం నగరంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలలో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులు వివిధ స్థాయి బెల్టులను సాధించినట్లు ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శారద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ విద్య ప్రాముఖ్యతను గుర్తించి దీనికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందేలా కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత



అధికారులు పట్టుకున్న ఇసుకలారీ

ముత్తారం, మార్చి25: మండలంలోని ఓడేడులో మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా మూడు లారీలలో ఇసుక నింపి తరలిస్తుండగా లారీలు దిగబడ్డాయి. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సోమవారం సిబ్బందితో వచ్చి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే మూడు లారీలను ఒక జేసీబీని సీజ్ చేసి పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 25 : కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులు వేల్పుల వెంకటరమణ, వేల్పుల తిరుపతిలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- రంగుల మయమైన కాలనీలు
- ఉత్సాహంతో నృత్యాలు చేసిన యువతీయువకులు


కరీంనగర్‌లో సంబరాల్లో పాల్గొన్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


తెలంగాణ చౌక్‌లో సంబరాలు


రాంనగర్‌లో వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు


కొత్తపల్లి మండలంలో సంబరాల్లో పాల్గొన్న ఎంపీపీ పిల్లి శ్రీలత

కరీంనగర్ టౌన్, మార్చి 25: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉద్యోగులు హోలి సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. కమిషనర్, డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులతోపాటు ఉద్యోగులంతా రంగులు చల్లుకొని ఆనందోత్సాహాల మధ్య హోలి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో శ్యాంకుమార్ కార్యాలయాలకు వెళ్లి హోలి శుభాకాంక్షలు తెలిపారు.

●భారతీయ సంస్కృతి వారసత్వ పరిరక్షణలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావు అన్నారు. సోమవారం తపస్ ఆధ్వర్యంలో హోలి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్ ఆధ్వర్యంలో జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులతో కలిసి డీఈవో నివాసానికి వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్, జడ్పీ సీఈవో, ఆర్డీవో, డిడబ్ల్యూవో, మార్కెటింగ్ అధికారి తదితర అధికారులను కలిసి హోలి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు జె.శశిధర్‌రెడ్డి, కె.సుధాకర్, ఉదయ్ కిరణ్, ఓపి రఘురాం, ఆర్.పవన్‌కుమార్, ఎం.ప్రేమ్‌చంద్రారెడ్డి, బొద్దుల సత్యం, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, సాయన్న కుమారస్వామి, మల్లికార్జున్, శంకరయ్య, శాంతిరాజ్, వి.అంజయ్య, జి.రాజేశ్వర్, రాఘోత్తంరెడ్డి, కటకం శ్రీనివాస్, జయకృష్ణారెడ్డి, మధుసూధన్‌రావు, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

● పీఆర్‌టీయుటి జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నంది శ్రీనివాస్, గుగ్గిళ్ళ సత్యం, చిటికెన కృష్ణకుమార్, కాందూరి వెంకటేశ్వర్లు అదనపు కలెక్టర్, ఆర్డీవోలను కలిసి హోలి శుభాకాంక్షలు తెలిపారు.

●**కరీంనగర్ అర్బన్:** హోలి పండుగ సందర్భంగా సోమవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు, నాయకులు రంగులు పూసుకుని వేడుకలను జరుపుకున్నారు.

●**భగత్‌నగర్:** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ నగరంలో హోలీ సంబురాల్లో పాలుపంచుకున్నారు. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ నగర ప్రజలకు రంగులు చల్లుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు, ఆటో డ్రైవర్లు, కూలీలతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. బండి సంజయ్ ఇంటి వద్దకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం సతీమణితో కలిసి హోలీ వేడుకలు జరుపుకున్నారు.

●కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు కొత్తపల్లి పట్టణంలో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కొత్తపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందితో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

●కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ ఆసిఫ్‌నగర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, గ్రామస్థులు, నాయకులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

●హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద నగర పాలకసంస్థ కార్మికులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** రాంనగర్‌లో హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సంబరాల్లో తూము రవీందర్, ఉమాదేవి, కుంట సంపత్, శ్రీ హర్ష అచ్యుత్ రుద్రా జున్ను, చోటు దన్ను మనిరుద్, లక్కీ, శ్రేష్ట, అమ్ములు, చిక్కి, చాణిక్య, మాధవి, భారతి, మమత, స్వప్న వసంత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ డివిజన్‌లో హోలీ వేడుకలు సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో వాకర్స్ అసోసియేషన్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. యువతి, యువకులు, చిన్నారులు ఒకరికొకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగులు పూసుకొని సంతోషంగా జరుపుకున్నారు.


నృత్యం చేస్తున్న కలెక్టర్

●**హుజూరాబాద్ రూరల్:** మండల వ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం రాత్రి కాముడి దహన కార్యక్రమం జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమకుమార్ తెలిపారు.

●**జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నపెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు రంగులు చల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని రహదారులు యువకుల కేరింతలతో సందడిగా మారాయి. స్థానిక గాంధీ చౌరస్తాలో నృత్యాలు, ఆట, పాటలతో హోరెత్తించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

●**జమ్మికుంట రూరల్:** మండలంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి గ్రామాల్లో కోలాహలం నెలకొంది. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీధులన్నీ రంగులమయంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు హోలీ వేడుకల్లో పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది.

●**తిమ్మాపూర్:** మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఎల్ఎండి కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అనురాధ దంపతులు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హోలీ ఆడారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** శంకరపట్నం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు చిన్న, పెద్ద వయసుతో సంబంధం లేకుండా ఆనందోత్సవాలతో ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సాంప్రదాయ వేడుకైనా హోలీ పండుగను నిర్వహించారు.

●**చొప్పదండి:** మండలంలో హోలి వేడుకలు ఘనంగా జరిగాయి. యువత, మహిళలు రంగులు చల్లుకొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చొప్పదండిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హోలి వేడుకలను నిర్వహించారు. హోలి పండుగను పురస్కరించుకొని చొప్పదండిలోని శ్రీ శివకేశవ ఆలయం, జ్ఞాన సరస్వతి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో సరస్వతి అమ్మవారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో హోలీ వేడుకలను నిర్వహించారు.

●**మానకొండూర్:** మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. హోలీ వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో యువతీ,యువకులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా వేడుకలలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. గ్రామాల్లోని పురవీధుల గుండా తిరుగుతూ యువకులు వివిధ రకాల రంగులను పూసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

●**రామడుగు:** మండలంలోని పలు గ్రామాలలో సోమవారం హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలోని యువతీ,యువకులు, చిన్నారులు, మహిళలు వేడుకలలో పాల్గొని వివిధ రకాల రంగులను పూసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

●**సైదాపూర్:** సైదాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో సోమవారం ప్రజలు హోళి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. యువతి, యువకులు, పిల్లలు రంగులు చల్లుకుంటు ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. హోళి పండుగ సందర్భంగా రోడ్లన్ని రగుల మయంగా మారాయి.

●**ఇల్లందకుంట:** మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ పర్వదినం సందర్భంగా ప్రజలందరూ హోలీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో హోలీ వసంతోత్సవ వేడుకలు ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వంశీధరచార్యులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు, వివిధ పార్టీల నాయకులు సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, అదికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**వీణవంక:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం హోలి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీణవంకలో ఎస్సై తిరుపతి తోటి సిబ్బందితో హోలి సంబరాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో యువకులు, పిల్లలు రంగులు చల్లుకుంటు హోలి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్ పట్టణంలో..


ఇల్లందకుంటలో హోలీ వేడుకలో ఎంపీపీ పావని


జమ్మికుంటలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు


చొప్పదండిలో సంబరాలు


సైదాపూర్ మండల కేంద్రంలో..


మానకొండూర్‌లో రంగులు పూసుకుంటున్న యువకులు, పిల్లలు

మట్టి పరిమళమే ఎన్నీల ముచ్చట్లు

● తెలంగాణ రచయితల వేదిక కార్యదర్శి బూర్ల

మానకొండూర్, మార్చి 25: తెలంగాణ మట్టిలో గొప్ప మహత్తు ఉన్నదని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఇక్కడి మట్టి నుంచే ఉద్భవించిన గొప్ప సంస్కృతి పరిరక్షణకు ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమం కృషిచేస్తుందని అన్నారు. సోమవారం మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారు పచ్చని పొలాల గట్ల మీద 'పగలే వెన్నెల' పేరిట 131వ ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 60 మంది కవులు, కవయిత్రులు కవితాగానం చేశారు. చైతన్య గీతాలు ఆలపించారు. దుద్దెనపల్లికి చెందిన రైతు కవి పెంచాల రంగయ్య ఎన్నీల ముచ్చట్లకు ఆతిథ్యం ఇచ్చారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్యలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ జానపద గాయకుడు మురళీమధు తన మూడు దశాబ్దాల పాటల ప్రయాణాన్ని వివరించారు. మురళీమధు, పెంచాల రంగయ్యలను కవులు సన్మానించారు. కవయిత్రుల ఆట, పాట పలువురిని ఆలరించింది. ఈ కార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, శ్రీరాం, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, పీఎస్ రవీంద్ర, తోట నిర్మల, పెరుగొండ సరసిజ, బసవేశ్వర్, వాసాల వరప్రసాద్, నెలువట్ల చైతన్య, కనకం శ్రీనివాస్, మమత, వేణు, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 25: ఉత్తర ఫల్గుణి నక్షత్రం మహాలక్ష్మీ అమ్మవారి జయంతి సందర్భంగా సోమవారం యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మీ యజ్ఞవరాహ స్వామివారికి విశేష ఆస్థానం నిర్వహించారు. సుమారు వేయి సంవత్సరాల క్రితం భగవద్రామానుజులు అమ్మవారి ద్వారా స్వామిని శరణాగతి చేసిన శరణాగతి, శ్రీరంగ, శ్రీవైకుంఠ గద్యాలను విన్నపం చేశారు. అమ్మవారికి అంతకు ముందు మహాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఘనంగా సహస్రదీపారాధన, చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు పవనకృష్ణశర్మ

కరీంనగర్ రూరల్, మార్చి 25: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని శ్రీదుర్గాభవాని దేవాలయంలో సోమవారం సహస్ర దీపారాధాన, చండీహోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చండీహోమం, పల్లకిసేవ, సహ్ర దీపారాధన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణశర్మ ఉయ్యాల సేవలతో పాటు విశేష హారతి, పూజ కార్యక్రమాలను కన్నుల పం డువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి సేవలో తరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం


ఎక్లాస్‌పూర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు


గోపాల్‌రావుపేటలో పట్టువస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలి సంఘం

సైదాపూర్, మార్చి 25: సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో శ్రీ లక్ష్మి సమేత వెంటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోత్సరణల మధ్య స్వామి వారిని రథంపై ప్రతిష్టించి, భక్తులు తాడుతో రథం లాగగా గ్రామంలో స్వామి వారిని ఊరేగించారు. అనంతరం లక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి వారిని గుడికి తీసుకెళ్లారు. అనంతరం పూర్ణాహుతి హోమం నిర్వహించి దేవతలకు చక్ర స్నానం చేయించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు గుండేటి శ్రీనివాస్, సీఈవో మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, గ్రామస్తులు వెంకటేశం, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మావతీదేవికి పట్టువస్త్రాలు, పుస్తేమట్టెలు అందజేశారు. ఈ నెల 27న జరుగబోయే కళ్యాణానికి పట్టు వస్త్రాలను అర్చకులకు అందజేశారు. ఆ సంఘం అధ్యక్షులు కొలిపాక మల్లయ్య, యూత్ అధ్యక్షులు అలవాల విష్ణు, నాయకులు సిరిపురం సత్యనారాయణ, మద్రేశం, మల్లేశం, కమలాకర్, లక్ష్మీనాయణ, ఆలయ కమిటి చైర్మన్ నార్ల రమేశ్, సభ్యులు దోనపాటి సీతారాంరెడ్డి, బుచ్చిరాములు, మల్లేశం, రామస్వామి, రాజిరెడ్డి ఉన్నారు.

గంగాధర: మండలంలోని గర్షకుర్తి వెంకటేశ్వర స్వామి, ఉప్పరమల్యాల తుమ్మెదలగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గర్షకుర్తి వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హవనం, బలిహరణం,బండ్ల తిరుగుట, శేషవాహనంపై డోలోత్సవాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో జరిగిన ఉత్సవాలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై పూజలు చేశారు. ఆయన వెంట జడ్పిటీసీ పుల్కం అనురాధనర్సయ్య, పురమల్లమనోహర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, మార్చి25: తిమ్మాపూర్ మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో గల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు సోమవారం రాత్రి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అయ్యప్ప దేవాలయంలో ఘనంగా కుంభాభిషేకం


జమ్మికుంట అయ్యప్పస్వామి ఆలయంలో కుంభాశిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

జమ్మికుంట, మార్చి 25: జమ్మికుంట పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం కుంభాభిషేక మహోత్సవం జగద్గురు పుష్పగిరి పీఠాధిపతి విద్యశంకర భారతీస్వామి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ శిఖరంపై వేదమంత్రోచ్చరణాల మధ్య కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు పోనగంటి సంపత్, ఆలయ అధ్యక్షుడు సిరిమల్ల జయందర్, ఆలయ కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, జగదీశ్వర్, అనుమాస రాజేందర్, వీరాజు, మామిడాల మనోహర్, శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థినిలకు స్టడీ మెటీరియల్ , ఆట వస్తువులు అందచేస్తున్న హరిణి, సతీష్

సుభాష్‌నగర్, మార్చి 25: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, కార్యమ్ బోర్డులను అందచేశారు. సోమవారం ఫౌండేషన్ సభ్యులు గోలి హరిణి, సతీష్‌ల కుమారుడు సహన్‌సాయి జన్మదినం సందర్భంగా నగరంలోని అందుల పాఠశాలలో హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, క్యారంబోర్డు, స్వీట్లు, చాక్లెట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూపా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసిఫ్‌నగర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రారంభం

కరీంనగర్ టౌన్, మార్చి 25: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకుశాఖను మంగళవారం ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు యాజమాన్య ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులో తెచ్చేందుకు ఈ శాఖను ఏర్పాటు చేస్తున్నామని, బ్యాంకు చైర్మన్ శోభ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. లాకర్ సదుపాయంతో పాటు మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు తదితర సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. బ్యాంకు ప్రారంభోత్సవంలో పాల్గొని సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి

కరీంనగర్ కల్చరల్, మార్చి25: రిటైర్డ్ ఉపాధ్యాయురాలు టి.ఆండాళు సోమవారం శ్రీపురం కాలనీలో అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఇల్లందుల సరస్వతి ప్రేరణతో స్త్రీ సంఘాలు ఓపెన్ చేసి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దారు. మద్యపాన నిషేదం, అక్షర ఉజ్వల, స్త్రీ విద్య నైతిక విలువలు సమాజ చైతన్యం సమ సమాజ స్థాపన లక్ష్యాలుగా పద్య రచన వ్యాసాలు కవితలు రాశారు. ఆమె మృతి పట్ల పలువురు ఉపాధ్యా యులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. మంగళవారం ఇరుకుల్ల శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.